'బుల్డోజర్ న్యాయం'పై సుప్రీం ఫైర్

నిందితుడైనంత మాత్రాన ఇల్లు కూల్చేస్తారా?

దోషిగా తేలినా కూడా కూల్చేయడం కుదరదు

- అక్రమ కట్టడమైనా చట్టాన్ని పాటించాల్సిందే
- ఈ అంశంపై మార్గదర్శకాలు జారీ చేస్తాం
- సలహాలు ఇవ్వాలని లాయర్లకు కోర్టు సూచన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: క్రిమినల్ కేసుల్లో నిందితులుగా ఉన్న వారి ఇండ్లను కూల్చేస్తూ పలు రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న 'బుల్డోజర్ న్యాయం'పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిందితుడిగా ఉన్నంత మాత్రాన ఇల్లు ఎలా కూల్చేస్తారని ప్రశ్నించింది. 2022లో ఢిల్లీలోని జహంగిర్‌పురిలో పలు ఇండ్ల కూల్చివేతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌తో పాటు అల్లర్ల కేసుల్లో నిందితుల ఆస్తులను కూల్చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సోమవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. 'కేవలం నిందితుడు అయినంత మాత్రాన ఇల్లు ఎలా కుల్చేస్తారు? దోషిగా తేలినప్పటికీ కూల్చేయడం కుదరదు' అని జస్టిస్ బీఆర్ గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ అక్రమ కట్టడమే అయినప్పటికీ చట్ట ప్రకారం నిర్దిష్ట ప్రక్రియను పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలను కోర్టు రక్షించబోదని, ఇందుకు సంబంధించి కొన్ని మార్గదర్శకాలు తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. 'ఓ తండ్రికి మాట వినని కొడుకు ఉండవచ్చు. ఈ కారణంతో ఇల్లు కూల్చేయడం సరైన పద్ధతి కాదు' అని జస్టిస్ విశ్వనాథన్ వ్యాఖ్యానించారు.

మార్గదర్శకాలు రూపొందిస్తాం: సుప్రీంకోర్టు

ఈ విషయానికి సంబంధించి కొన్ని మార్గదర్శకాలు రూపొందించాల్సిన అవసరం ఉందని, ఇవి అన్ని రాష్ర్టాల్లో అమలు చేయాలని సుప్రీంకోర్టు పేర్కొన్నది. సరైన మార్గదర్శకాలు రూపొందించేందుకు గానూ సీనియర్ న్యాయవాది నచికేత జోషికి ప్రతిపాదనలు అందజేయాలని న్యాయవాదులకు సూచించింది. న్యాయవాదులతో సమన్వయం చేసుకొని ప్రతిపాదనలు కోర్టుకు సమర్పించాలని నచికేత జోషిని కోరింది. 'ఈ సమస్యను దేశవ్యాప్తంగా పరిష్కరించేందుకు ప్రయత్నిద్దాం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

కోర్టును యుద్ధక్షేత్రంగా మార్చొద్దు

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. కేవలం క్రిమినల్ కేసులో నిందితుడిగా ఉన్నాడనే కారణంతో ఇల్లు కూల్చడం లేదని తెలిపారు. మున్సిపల్ లేదా స్థానిక సంస్థల చట్టాలను ఉల్లంఘించి నిర్మించిన వాటిని మాత్రమే కూల్చేస్తున్నట్టు చెప్పారు. ముందుగా నోటీసులు జారీ చేసిన తర్వాతే కూల్చివేతలు జరిగినట్టు పేర్కొన్నారు. జమాతే ఉలేమా ఇ హింద్ తరఫు న్యాయవాది దుశ్యంత్ దవే వాదిస్తూ.. 2022 ఏప్రిల్‌లో అల్లర్లు జరిగిన వెంటనే ఢిల్లీ జహంగిర్‌పురిలో అల్లర్లలో పాల్గొన్నారనే ఆరోపణలతో అనేక మందివి ఇండ్లు కూల్చేశారని పేర్కొన్నారు. మరో న్యాయవాది చందర్ ఉదయ్ సింగ్ వాదిస్తూ.. ఉదయ్‌పూర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న వ్యక్తి కుమారుడు ఓ నేరంలో నిందితుడిగా ఉన్నందుకు ఆ ఇంటిని కూల్చేశారని తెలిపారు. విచారణ సందర్భంగా ఇరుపక్షాల న్యాయవాదుల మధ్య తీవ్ర వాగ్వాదం జరగడంతో కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు గదిని యుద్ధక్షేత్రంగా మార్చొద్దని న్యాయవాదులను నిలువరించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 17కు వాయిదా వేసింది.

బందీల విడుదలకు హమాస్‌తో ఒప్పందం కుదుర్చుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వేలాది మంది పౌరులు ఆదివారం ఇజ్రాయెల్ వ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించారు.

వారానికి 24 గంటలే పని

- కెనడాలో ఆఫ్-క్యాంపస్ ఉద్యోగాలపై పరిమితి
- భారతీయ విద్యార్థులకు పెరగనున్న ఆర్థిక కష్టాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: ఉన్నత విద్య కోసం కెనడా వెళ్లిన విదేశీ విద్యార్థులకు జస్టిన్ ట్రూడో ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఇప్పటికే వలస (ఇమ్మిగ్రేషన్) విధానాలను మార్చడంతోపాటు స్టడీ పర్మిట్లపై పరిమితి విధించాలని, శాశ్వత నివాస దరఖాస్తుల (పర్మినెంట్ రెసిడెన్సీ నామినేషన్ల) సంఖ్యను కుదించాలని నిర్ణయించడం ద్వారా ఎంతో మంది విదేశీ విద్యార్థులను కష్టాల్లోకి నెట్టిన కెనడా ప్రభుత్వం.. తాజాగా ఆఫ్-క్యాంపస్ జాబ్స్‌పై పరిమితి విధించింది. ఇకపై విదేశీ విద్యార్థులు తమ జీవన ఖర్చుల కోసం క్యాంపస్ వెలుపల వారానికి 24 గంటలకు మించి పనిచేయకూడదన్న నిబంధనను ప్రవేశపెట్టింది. ఈ నెల నుంచే ఈ నిబంధనను అమల్లోకి తెచ్చింది. దీంతో లక్షల మంది విదేశీ విద్యార్థులకు, అత్యధికంగా భారతీయ విద్యార్థులకు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు తలెత్తనున్నాయి. వాస్తవానికి గతంలో కెనడాలో విదేశీ విద్యార్థులు వారానికి 20 గంటలు మాత్రమే క్యాంపస్ వెలుపల పనులు చేసుకునేందుకు వీలుండేది. కానీ, కొవిడ్ సంక్షోభ సమయంలో అక్కడ కార్మికుల కొరత ఏర్పడటంతో ఈ నిబంధనను తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ వెసులుబాటు గడువు ఈ ఏడాది ఏప్రిల్ 30తో ముగియడంతో ఇప్పుడు కొత్త నిబంధనను అమల్లోకి తెచ్చారు.

కూలిన మిగ్-29.. పైలట్ సురక్షితం

జైపూర్: ఐఏఎఫ్ మిగ్-29 యుద్ధ విమానం సోమవారం రాజస్థాన్‌లోని బామర్‌లో కూలిపోయింది. కూలిపోవడానికి ముందే పైలట్ సురక్షితంగా బయటపడగలిగారు. బామర్ సెక్టార్‌లోని ఐఏఎఫ్ బేస్ నుంచి శిక్షణ కోసం బయల్దేరిన ఈ విమానంలో సాంకేతిక లోపం ఏర్పడినట్టు అధికారులు తెలిపారు. ఉత్తర్లాయ్ ప్రాంతంలో కూలిన వెంటనే మంటల్లో చిక్కుకున్నట్టు చెప్పారు. ఘటనపై విచారణకు ఆదేశించినట్టు తెలిపారు.

వ్యవసాయ రంగంలో 7 కొత్త పథకాలు

కేంద్ర క్యాబినెట్ నిర్ణయం

న్యూఢిల్లీ: వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి కోసం ఏడు కొత్త కార్యక్రమాలను అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దాదాపు రూ.14 వేల కోట్లతో ఈ కార్యక్రమాలను అమలు చేయనుంది. ఇందులో డిజిటల్ వ్యవసాయ మిషన్‌కు రూ.2,817 కోట్లు, క్రాప్ సైన్స్‌కు రూ.3,979 కోట్లు కేటాయించాలని నిర్ణయించింది. ముంబై-ఇండోర్ మధ్య రూ.18,036 కోట్లతో 309 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. గుజరాత్‌లోని సనంద్‌లో రూ.3,307తో సెమికండక్టర్ల తయారీ యూనిట్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది.

ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా అరెస్ట్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్‌ను, ఆయన సహచరులు కొందరిని ఈడీ సోమవారం అరెస్ట్ చేసింది. ఉదయం 6 గంటలకే ఎమ్మెల్యే నివాసంలో సోదాలు నిర్వహించిన అధికారులు అనంతరం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. తాము అడిగిన కొన్ని ప్రశ్నలకు ఎమ్మెల్యే అస్పష్ట సమాధానాలు ఇవ్వడంతో అరెస్ట్ చేశామని ఈడీ పేర్కొంది. అమానతుల్లా ఢిల్లీ వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా ఉన్నప్పుడు (2018-2022) చట్టవిరుద్ధంగా సిబ్బందిని నియమించారని, బోర్డు ఆస్తులను పారదర్శకత లేకుండా లీజుకు ఇచ్చారని ఈడీ ఆరోపించింది.

బిభవ్‌కుమార్‌కు బెయిల్

రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్‌పై దాడి కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సహాయకుడు బిభవ్ కుమార్‌కు సుప్రీంకోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. అయితే, కేసులో సాక్షులందర్నీ విచారించే వరకు ఢిల్లీ సీఎం నివాసంలోకి ప్రవేశించరాదని బిభవ్‌పై నిషేధం విధించింది. ఢిల్లీ సీఎం కార్యాలయంలో ఎలాంటి బాధ్యతలు తీసుకోరాదని, కేజ్రీవాల్ సహాయకుడిగా తిరిగి విధుల్లో చేరకూడదని ఆదేశించింది.

23వ న్యాయ సంఘం ఏర్పాటు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: దేశంలో 23వ న్యాయ సంఘాన్ని నియమిస్తూ కేంద్ర న్యాయశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 22వ న్యాయ సంఘం పదవీకాలం ఆగస్టు 31తో ముగిసిన నేపథ్యంలో కొత్త సంఘాన్ని ఏర్పాటు చేసింది. 23వ న్యాయ సంఘానికి పూర్తికాల చైర్మన్‌తో పాటు నలుగురు పూర్తికాల సభ్యులు, ఒక సభ్య కార్యదర్శి ఉండనున్నారు. న్యాయ వ్యవహారాల విభాగం కార్యదర్శి, శాసన విభాగం కార్యదర్శి ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు. న్యాయ సంఘంలో ఐదుగురికి మించకుండా పార్ట్‌టైమ్ సభ్యులు ఉంటారు.

రేపిస్టులకు ఉరిశిక్ష!

'అపరాజిత' పేరుతో బెంగాల్ సర్కారు బిల్లు

కోల్‌కతా, సెప్టెంబర్ 2: మహిళలపై రేప్, హత్యలకు పాల్పడేవారికి ఉరిశిక్ష విధించేందుకు ఉద్దేశించిన 'అపరాజిత మహిళా & శిశు బిల్లు'ను పశ్చిమ బెంగాల్ శాసన సభ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్టు తృణమూల్ కాంగ్రెస్ వర్గాలు సోమవారం తెలిపాయి. కోల్‌కతా వైద్య విద్యార్థిని హత్యాచారంపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది. మంగళవారం సభలో ప్రవేశపెట్టనుంది.

ఆర్‌జీ కర్ దవాఖాన మాజీ ప్రిన్సిపాల్ అరెస్ట్

కోల్‌కతా: ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్‌ను సీబీఐ సోమవారం అరెస్ట్ చేసింది. ఆర్థిక అవకతవకలకు సంబంధించిన కేసులో ఈ చర్య తీసుకుంది. ఈ దవాఖానలో ఆగస్ట్ 9న ఓ ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసులో డాక్టర్ సందీప్‌ను సీబీఐ 15వ రోజు ప్రశ్నించిన తర్వాత కోల్‌కతాలోని నిజాం ప్యాలెస్ ఆఫీస్‌కు తీసుకెళ్లింది. అక్కడ ఆయనను అరెస్ట్ చేసినట్టు ప్రకటించింది. ఆర్థిక అవకతవకలపై దర్యాప్తు కోసం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. అయితే కలకత్తా హైకోర్టు ఈ దర్యాప్తు బాధ్యతలను సీబీఐకి అప్పగించింది.

ముస్లింలపై బీజేపీ ఎమ్మెల్యే రాణే విద్వేష వ్యాఖ్యలు

ముంబై, సెప్టెంబర్ 2: మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే నితేశ్ రాణే ముస్లింలపై విద్వేషాన్ని వెళ్లగక్కారు. 'రామ్‌గిరి మహరాజ్‌కి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే, మసీదుల్లో చొరబడి, ఒక్కొక్కరి సంగతి చూస్తాం. జాగ్రత్త..!' అంటూ బెదిరింపులకు దిగారు. ఆదివారం (సెప్టెంబర్ 1) అహ్మద్‌నగర్ జిల్లాలో నిర్వహించిన రెండు సభల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్టు ఓ వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. గత నెల ఆగస్టు 14న నాసిక్‌లో రాణే చేసిన విద్వేష ప్రసంగం కారణంగా ఛత్రపతి శంభాజీ నగర్‌లో ఉద్రిక్తతలు తలెత్తాయి. దీనిపై ముంబై కాంగ్రెస్ అధ్యక్షుడు గైక్వాడ్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో, అహ్మద్‌నగర్ పోలీసులు రాణేపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదుచేశారు.

కీళ్ల వాతానికి హైడ్రోజెల్

చైనా శాస్త్రవేత్తల అభివృద్ధి

బీజింగ్, సెప్టెంబర్ 2: కీళ్ల నొప్పులు (ఆర్థరైటిస్) లేదా కీళ్లవాతం అనేది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అనేక మందిని బాధిస్తున్న ఆరోగ్య సమస్య. ముఖ్యంగా 40 ఏండ్లు దాటిన వాళ్లలో ఈ సమస్య ఎక్కువగా కనపడుతున్నది. కీళ్లవాతంలో 'ఆస్టియో ఆర్థరైటిస్' అనే ఆరోగ్య సమస్యకు పరిష్కారం చూపే అడ్వాన్స్‌డ్ లూబ్రికెంట్‌ను చైనా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. తాము తయారుచేసిన హైడ్రోజెల్.. దెబ్బతిన్న మృదులాస్థి (ఎముకల్లోని గుజ్జు)ని టార్గెట్ చేసుకొని పనిచేస్తుందని, దానిని తిరిగి పునరుద్ధరణ చేసే విధంగా పనిచేస్తుందని చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ తెలిపింది. హైడ్రోజెల్ వాడటం ద్వారా ఆర్థరైటిస్ వ్యాధి తీవ్రం కాకుండా అడ్డుకోవచ్చునని సైంటిస్టుల అధ్యయనం పేర్కొన్నది. షాంఘైలోని అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన పరిశోధకులు దీనిని తయారుచేశారు.

పొడవాటి వ్యక్తులకు క్యాన్సర్ ముప్పు

న్యూఢిల్లీ: పొట్టిగా ఉండేవారితో పోలిస్తే కాస్తంత పొడవు ఉంటే ఆ ఆత్మవిశ్వాసమే వేరుగా ఉంటుంది. అయితే పొడవు మన పాలిట శాపంగా మారుతుందని తాజా అధ్యయనం ఒకటి స్పష్టం చేసింది. ఎత్తు ఎక్కువ ఉన్నవారికి క్యాన్సర్ ముప్పు అధికమని 'యూకే మిలియన్ విమెన్ స్టడీ' తేల్చింది. తాము అధ్యయనం చేసిన 17 మంది పొడుగు వ్యక్తులలో 15 మంది క్యాన్సర్ బాధితులేనని తెలిపింది. పొట్టి వారితో పోలిస్తే పొడవుగా ఉన్న వారు త్వరగా క్యాన్సర్ బారినపడతారని అధ్యయనం పేర్కొన్నది. పొడుగు వ్యక్తులు పాంక్రియాస్, ఓవరీ, ప్రొస్టేట్, కిడ్నీ, స్కిన్ (మెలానోమా), బ్రెస్ట్ (మెనోపాజ్ ముందు, వెనక), పెద్దపేగు, యుటెరస్ (ఎండోమెట్రియం) వంటి క్యాన్సర్ల బారినపడే అవకాశం ఉన్నదని వరల్డ్ క్యాన్సర్ రిసెర్చ్ ఫండ్ తెలిపింది. పెరిగే ప్రతి 10 సెంటీమీటర్ల ఎత్తుకు క్యాన్సర్ వచ్చే ముప్పు 16 శాతం ఉంటుందని వివరించింది.



ఎత్తుకు క్యాన్సర్‌కు సంబంధం ఏమిటి?

ఎత్తు ఎక్కువగా ఉన్న వారిలో కణాలు పెద్ద సంఖ్య లో ఉంటాయి. క్యాన్సర్ ముప్పుకు ఇది కూడా ఒక కారణం. పొడవు ఎక్కువగా ఉన్న వ్యక్తులలో ఎక్కువ కణాలతో పొడవాటి పెద్ద పేగు ఉంటుంది. ఇది పెద్ద పేగు క్యాన్సర్‌కు కారణం అవుతుంది. ఒక కణం విభజనకు గురై కొత్త కణం తయారైనప్పుడు ఏర్పడే జన్యువులు దెబ్బతినడం వల్ల కూడా క్యాన్సర్ అభివృద్ధి చెందుతుంది. ఇలా ఎక్కువ సార్లు జన్యువులు దెబ్బతింటే క్యాన్సర్ రిస్క్ కూడా ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. కొన్ని పరిశోధనల ప్రకారం పొడవాటి వ్యక్తులలో పెద్ద మొత్తంలో కణాలు క్యాన్సర్ అభివృద్ధికి కారకంగా మారతాయి. ఇన్సులిన్ లాంటి గ్రోత్ ఫ్యాక్టర్ 1 (ఐజీఎఫ్-1) హార్మోన్ వల్ల కూడా క్యాన్సర్ బారినపడే అవకాశం ఉన్నది. అయితే, ఐజీఎఫ్-1 స్థాయిలు సగటు కంటే ఎక్కువగా ఉంటే ప్రొస్టేట్, రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.

హారిస్‌కు ట్రంప్ సతీమణి మద్దతు!

వాషింగ్టన్, సెప్టెంబర్ 2: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ టంప్‌ను ఆయన సతీమణి మెలానియా ట్రంప్ ఇష్టపడటం లేదు. దేశాధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిని కమల హారిస్ గెలవాలని ఆమె కోరుకుంటున్నారు. కమలకు ఆమె రహస్యంగా మద్దతిస్తున్నారు. ట్రంప్ మాజీ వైట్ హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ ఆంథోనీ స్కరముచి ఈ వివరాలను తెలిపారు. హ్యారిస్ విజయం గురించి అత్యంత ఉత్సాహంతో ఎదురు చూస్తున్న వ్యక్తి మెలానియా అని చెప్పారు. ట్రంప్ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో మెలానియా సాదాసీదాగా పాల్గొంటున్న నేపథ్యంలో స్కరముచి ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ కోసం ఎన్నికల నిధుల సేకరణలో మెలానియా తక్కువగా పాల్గొన్నారు. స్కరముచి ఆరోపణలను డొనాల్డ్ ట్రంప్ తోసిపుచ్చారు.

కర్ణాటక సీఎం రేసులోకి కొత్త ఫేసు

- ముఖ్యమంత్రి కావాలని ఉందన్న కాంగ్రెస్ సీనియర్ నేత దేశ్‌పాండే
- ఇప్పటికే సీఎం పీఠంపై కన్నేసిన డీకే శివకుమార్, పరమేశ్వర

బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి పదవి నుంచి సిద్ధరామయ్య దిగిపోగానే ఆ పీఠాన్ని అందుకునేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటివరకు డిప్యూటీ సీఎం శివకుమార్, హోంమంత్రి జీ పరమేశ్వర సీఎం పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తుండగా ఇప్పుడు మరో సీనియర్ నేత ఆర్వీ దేశ్‌పాండే కూడా రేసులోకి వచ్చారు. మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'మంత్రి పదవులను నిర్వర్తించి అలిసిపోయాను. ఇక నేను ముఖ్యమంత్రిని కావాల్సి ఉంది' అని వ్యాఖ్యానించారు. తాను సిద్ధరామయ్య కంటే రెండేండ్లే పెద్దవాడినని, కాంగ్రెస్ అధిష్ఠానం, సిద్ధరామయ్య అంగీకరిస్తే సీఎం అవుతానని ప్రకటించారు. దీని ద్వారా సిద్ధరామయ్యకు పదవీగండం పొంచి ఉందనే విషయాన్ని దేశ్‌పాండే చెప్పకనే చెప్పారు. ముడా స్కామ్‌లో సిద్ధరామయ్య ప్రమేయం లేదని చెప్తూనే దేశ్‌పాండే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

సిద్ధరామయ్య సోషల్ మీడియా ఖర్చు నెలకు రూ.54 లక్షలు

ఆర్టీఐ దరఖాస్తుకు సమాధానం

బెంగళూరు : కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికారిక, వ్యక్తిగత సామాజిక మాధ్యమాల ఖాతాల నిర్వహణ కోసం నెలకు రూ.53.9 లక్షలు (18 శాతం జీఎస్టీతో కలిపి) ఖర్చు అవుతున్నది. 2023 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు రూ.3.18 కోట్లు ఖర్చు అయింది. ఈ సొమ్మును 'ది పాలసీ ఫ్రంట్' అనే ఖాతాకు ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసింది. ఈ ఖాతాల నిర్వహణకు 35 మంది సిబ్బంది ఉన్నారు. సమాచార హక్కు చట్టం ప్రకారం దాఖలు చేసిన దరఖాస్తుకు ఇచ్చిన సమాధానంలో కర్ణాటక రాష్ట్ర మార్కెటింగ్ కమ్యూనికేషన్ అండ్ అడ్వర్టయిజింగ్ లిమిటెడ్ (ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థ) ఈ వివరాలను తెలిపింది.



దేశ్‌పాండే

గతంలో ఫోన్‌ట్యాపింగ్ ఆరోపణలు వచ్చినందుకు రామకృష్ణ హెగ్డే సీఎంగా రాజీనామా చేశారని, కానీ ఇప్పుడు విలువలతో కూడిన రాజకీయాలు లేవని వ్యాఖ్యానించారు.

ముడా స్కామ్ బయటపెట్టిన ఆర్టీఐ కార్యకర్తకు బెదిరింపులు

ముడా (మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) స్కామ్‌లో సీఎం సిద్ధరామయ్య అక్రమాలపై సంచలన విషయాలు బయటపెట్టిన ఆర్టీఐ కార్యకర్త ఎన్ గంగరాజు, తనకు ప్రాణహాని ఉందని మీడియా ముఖంగా భయాందోళన వ్యక్తం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు తనను, తన కుటుంబ సభ్యుల్ని బెదిరిస్తున్నారని సోమవారం విలేకర్లతో చెప్పారు. రియల్ మాఫియా నుంచి బెదిరింపులు వస్తున్నాయని, తనకు భద్రత కల్పించాలంటూ సీఎం కార్యాలయానికి లేఖ రాసినట్టు తెలిపారు. దీంతో మైసూర్‌లోని ఆయన ఇంటివద్ద కర్ణాటక పోలీసులు పెట్రోలింగ్ చేపట్టారు.

ఖర్గే ట్రస్ట్‌కు ఫ్రీగా 19 ఎకరాలు!

- కలబురిగిలో సిద్ధరామయ్య సర్కారు ధారాదత్తం
- బెంగళూరులోని హైటెక్ డిఫెన్స్ ఏరోస్పేస్ పార్కులో ఐదెకరాలు కట్టబెట్టడంపై ఇప్పటికే వివాదం
- సమగ్రంగా స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని బీజేపీ డిమాండ్

ఖర్గే

బెంగళూరు, సెప్టెంబర్ 2: కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నడుస్తున్న 'సిద్ధార్థ విహార ట్రస్ట్' భూ కేటాయింపుల వ్యవహారం కర్ణాటకలో వివాదాస్పదంగా మారింది. బెంగళూరులోని హైటెక్ డిఫెన్స్ ఏరోస్పేస్ పార్క్‌లో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి ట్రస్ట్‌కు కేటాయించిన కాంగ్రెస్ సర్కార్, కలబురిగిలో మరో 19 ఎకరాల ప్రభుత్వ భూమిని ట్రస్ట్‌కు ధారాదత్తం చేసిన సంగతి తాజాగా బయటకొచ్చింది. ఇందుకు సంబంధించి ఆ రాష్ట్ర బీజేపీ తీవ్ర ఆరోపణలు చేసింది. కలబురిగిలో ట్రస్ట్‌కు చెందిన 'పాలి, సంస్కృత, కంపారిటీవ్ ఫిలాసఫీ ఇనిస్టిట్యూట్'కు 19 ఎకరాల ప్రభుత్వ భూమిని ఉచితంగా కేటాయించారని బీజేపీ ఎంపీ లహర్ సింగ్ సిరోయ ఆరోపించారు. 'పాలి ఇన్‌స్టిట్యూట్‌కు 2014లో 16 ఎకరాలు కేటాయించారు. కొన్నాళ్ల తర్వాత మరో 3 ఎకరాలు ఇచ్చారు. మొత్తం 19 ఎకరాలను 2017 మార్చిలో ట్రస్ట్ పేరిట ఉచితంగా బదిలీ చేశారు' అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఈ భూ కేటాయింపుపై స్వతంత దర్యాప్తు చేపట్టాలని లహర్ సింగ్ డిమాండ్ చేశారు.

సీఎస్ నుంచి నివేదిక కోరిన గవర్నర్

ఖర్గే కుటుంబ సభ్యుల ట్రస్ట్‌కు భూ కేటాయింపుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలపై కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ స్పందించారు. అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై తనకు నివేదిక సమర్పించాలని రాష్ట్ర సీఎస్ శాలిని రజనీష్‌ని గవర్నర్ సోమవారం ఆదేశించారు.

తోడేలుతో పోరాడి.. కొడుకును కాపాడి

లక్నో: యూపీకి చెందిన ఓ తల్లి తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తోడేలుతో పోరాడి తన కుమారుడిని రక్షించుకున్నది. భరూచ్‌లోని హర్ది ప్రాంతంలో ఆదివారం ఐదేండ్ల బాలుడు పరాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి నిద్రపోతుండగా ఓ తోడేలు దాడి చేసి ఎత్తుకెళ్లింది. ఇది గమనించిన అతడి తల్లి మరో ఆలోచన లేకుండా వెంటనే మంచం మీద నుంచి తోడేలుపైకి దూకింది. అత్యంత చాకచక్యంతో దాని మెడను గట్టిగా నొక్కిపెట్టింది. ఉక్కిరిబిక్కిరి అయిన ఆ తోడేలు పరాస్‌ను వదిలిపెట్టింది. అనంతరం ఆమె గట్టిగా అరిచి, కుటుంబ సభ్యుల సాయం కోరింది. వారంతా వచ్చే సరికి తోడేలు పారిపోయింది. సుమారు 50 రోజుల నుంచి భరూచ్ సహ మరికొన్ని జిల్లాలో తోడేళ్లు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సోమవారం మరో బాలికను తోడేళ్లు పొట్టనబెట్టుకున్నాయి. తోడేళ్లను పట్టుకోవడానికి అటవీ శాఖాధికారులు చిన్న పిల్లల మూత్రంతో తడిసిన రంగు రంగుల టెడ్డీ బేర్లను అవి విశ్రాంతి తీసుకునే నదీ పరీవాహక ప్రాంతాల్లో పెడుతున్నారు. తోడేళ్లు రాత్రి వేళ జనంపై దాడి చేసి, ఉదయానికల్లా తిరిగి తమ విశ్రాంతి ప్రదేశాలకు వెళ్లిపోతున్నాయని డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ అజిత్ ప్రతాప్ సింగ్ చెప్పారు.

కులగణనకు ఆర్ఎస్ఎస్ మద్దతు!

రాజకీయ లబ్ధి కోసం దుర్వినియోగం చేయొద్దని వ్యాఖ్య

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: దేశంలో కులగణనకు ఆర్ఎస్ఎస్ మద్దతు ప్రకటించింది. ఈ అంశంపై ఆర్ఎస్ఎస్ ముఖ్య అధికార ప్రతినిధి సునీల్ అంబేకర్ సోమవారం కీలక వ్యాఖ్యలు చేశారు. 'హిందూ సమాజంలో కులం, కుల సంబంధాలు అనే సున్నితమైన అంశం ఉంది. జాతీయ ఐక్యత, సమగ్రతకు సైతం ఇది ముఖ్యమైన అంశం. నిర్దిష్ట సమాజం లేదా కులానికి అందించే అన్ని సంక్షేమ పథకాలను ప్రత్యేక శ్రద్ధతో అమలు చేయాలనేది ఆర్ఎస్ఎస్ అభిప్రాయం. ఇందుకోసం ప్రభుత్వానికి గణాంకాలు కావాలి. అయితే ఎన్నికల ప్రయోజనాలకు, రాజకీయ లబ్ధికి ఈ గణాంకాలను దుర్వినియోగం చేయరాదు' అని సునీల్ అంబేకర్ వ్యాఖ్యానించారు.

హిమాచల్.. దివాలా!

రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్

- ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అడ్డగోలు హామీల ప్రకటన
- రాష్ట్రం పాలిట గుదిబండగా మారిన హస్తం గ్యారెంటీలు
- పెరిగిపోయిన అప్పు.. ఖాళీ అయిన ప్రభుత్వ ఖజానా
- పింఛనర్ల సంక్షేమ నిధి నుంచి డబ్బు తీసుకున్న వైనం
- గ్యారెంటీలు, రాయితీలకు కత్తెర పెడుతున్న సర్కారు
- ఇదే బాటలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వాలు?!



సుఖ్‌విందర్ సింగ్

షిమ్లా, సెప్టెంబర్ 2: 'ఎన్ని హామీలైనా ఇవ్వాలి.. ఎన్నికల్లో మాత్రం గెలవాలి' అనే కాంగ్రెస్ తీరు ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ర్టాలను దివాలా తీయిస్తున్నది. గ్యారెంటీల పేరుతో హామీలు ఇచ్చే ముందు ఆయా రాష్ర్టాల ఆర్థిక పరిస్థితిని పట్టించుకోని కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక నెరవేర్చే దారి లేక కోతలు పెడుతున్నది. తాజాగా హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ సర్కారు తీరు ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నది. 2022 చివర్లో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఏకంగా 10 గ్యారెంటీలు ప్రకటించింది. 18 ఏండ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500, ప్రతి కుటుంబానికి 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, పాత పింఛన్ విధానం అమలు వంటి అనేక హామీలు ఇచ్చింది. అయితే, హిమాచల్ ప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ఈ హామీలను అమలు చేసే స్థితిలో లేదు. ఇదేమీ పట్టించుకోకుండా హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన సుఖ్‌విందర్ సింగ్ సుఖు సర్కారు ఇప్పుడు హామీలకు, సబ్సిడీలకు కత్తెర పెట్టే పనిని ప్రారంభించింది.

ఒక్కొక్కరిపై రూ.1.17 లక్షల అప్పు

దేశంలో తలసరి అప్పు ఎక్కువగా ఉన్న రాష్ర్టాల్లో హిమాచల్ ప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. రాష్ట్రంలో ఒక్కొక్కరిపై రూ.1.17 లక్షల అప్పు భారం ఉంది. ఈ చిన్న రాష్ట్రం అప్పు ఇప్పుడు రూ.86,589 కోట్లకు చేరింది. మరోవైపు కొత్త పింఛన్ పథకం అమలు వల్ల రాష్ట్రం కొత్త అప్పు తీసుకోవడంపై కేంద్రం పరిమితులు విధించిందని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపిస్తున్నది. ఒకవైపు ఇప్పటికే ఉన్న అప్పులకు మిత్తీల భారం, మరోవైపు కొత్త అప్పులపై పరిమితులు, పెరిగిపోయిన పథకాల భారంతో సుఖు సర్కారుకు దిక్కుతోచడం లేదు. ఆఖరికి పెన్షన్ల శాఖలో ఉండే పింఛనర్ల సంక్షేమ నిధి నుంచి సైతం ప్రభుత్వం డబ్బును వాడుకుంది. తమ జీతాలు రెండు నెలలు వాయిదా వేసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది.

14 సబ్సిడీలకు కత్తెర పెట్టేందుకు కసరత్తు

మహిళలకు నెలకు రూ.1,500 ఇవ్వడం ప్రధానంగా ఆర్థిక భారం మోపుతున్నదని అధికారులు చెప్తున్నారు. ఇక, రాష్ట్రం ఈ పథకాల భారాన్ని మోయలేదని భావిస్తున్న ప్రభుత్వం ఇప్పుడు వాటికి కోతలు పెట్టే పనిని ప్రారంభించింది. అన్ని కుటుంబాలకు నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇంకా ఈ పథకాన్ని అమలు చేయలేదు. పైగా ఇప్పటికే ఉన్న 125 యూనిట్ల విద్యుత్తు సబ్సిడీపై కోతలు విధించింది. బీపీఎల్ పరిధిలో ఉన్న వారికి మాత్రమే సబ్సిడీ వర్తిస్తుందని ప్రకటించింది. మొత్తం 14 సబ్సిడీలపై కోతలు విధించేందుకు సిద్ధమైంది. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని తొలగించి 50 శాతం టికెట్ వసూలు చేయాలని నిర్ణయించింది. ఉచిత నీటి సరఫరా పథకాన్ని నిలిపివేయాలని భావిస్తున్నది.

వేతనాలు ఆలస్యం.. డీఏలు పెండింగ్

అధికారంలోకి వచ్చి రెండేండ్లు గడుస్తున్నా ఇంకా పలు హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదు. మరోవైపు ఉన్న పథకాలకు సైతం కత్తెర పెడుతుండటం పట్ల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఎన్నికల్లో హామీలు ఇచ్చే ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కాంగ్రెస్‌కు తెలియదా అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ, అలవెన్సులు ఇచ్చేందుకు ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని, ఆఖరికి పింఛన్ల సంక్షేమ నిధి నుంచి కూడా డబ్బులు తీసుకుంటున్నదని ప్రతిపక్ష నేత జైరాం ఠాకూర్ ఆరోపించారు. ఉద్యోగులకు వేతనాలు సమయానికి ఇవ్వడం లేదని, కాంగ్రెస్ సర్కారుకు ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడమే ఆర్థిక సంక్షోభానికి కారణమన్నారు.

ఇదే బాటలో కర్ణాటక, తెలంగాణ!

గ్యారెంటీల పేరుతో గెలిచిన కర్ణాటక, తెలంగాణలోనూ కాంగ్రెస్ వ్యవహారం ఇదే రకంగా ఉంది. కర్ణాటకలో గ్యారెంటీల అమలు ఆ రాష్ట్రంపై ఆర్థిక భారం మోపి ంది. దీంతో ధరలు పెంచి, ఖజానా నింపేందుకు సిద్ధరామయ్య సర్కారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. మరోవైపు గ్యారెంటీల అమలును సైతం పునఃపరిశీలించాలని కాంగ్రెస్ నాయకులే డిమాండ్ చేస్తున్నారు. గ్యారెంటీలు అమలు చేయలేకనే ఈ డిమాండ్ తెరపైకి తెస్తున్నారనే వాదన ఉంది. ఇక, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలు అవుతున్నా హామీల అమలును మాత్రం పట్టించుకోవడం లేదు. ఒకటి, రెండు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని సర్కారు చెప్తున్నప్పటికీ లబ్ధిదారులు అందరికీ అందడం లేదు. ఈ మూడు రాష్ర్టాల్లో కాంగ్రెస్ వ్యవహారాన్ని చూస్తున్న విశ్లేషకులు.. కేవలం ఎన్నికల్లో గెలిచేందుకు ఇష్టారీతిన హామీలు ఇచ్చి ఇప్పుడు చేతులెత్తేస్తున్నదని విమర్శిస్తున్నారు. పథకాలు, సబ్సిడీలకు కోతలు విధించడానికి ఇవాళ హిమాచల్ సర్కార్ శ్రీకారం చుట్టిందని, రేపు కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలూ ఇదే వైఖరిని పాటించే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.